క్లుప్తంగా

రెయ్యి వెంకటరమణకు అభినందన సత్కారం



కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణను సత్కరిస్తున్న మాధవధార యూత్

మద్దిపాలెం: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితుడైన 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణకు అభినందనలు వెల్లువెత్తాయి. వార్డు కార్యాలయంలో సోమవారం ఆయనను మాధవధార యూత్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ తనను నమ్మి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. తనకు సహకరించిన పార్టీ ముఖ్య నేతలకు ధన్యవాదాలు తెలియజేశారు. సందీప్, శ్రీకాంత్, నాయుడు, రవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మద్దిలపాలెం డిపో నాయకులు

సీతంపేట: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మద్దిలపాలెం ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు సోమవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు చిన్నా, ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీను, జాయింట్ సెక్రటరీ ఒ.వై.బాబు, ఎమ్మెస్ రావు, గోపాల్ పాల్గొన్నారు.

నల్లి ధర్మారావుకు చందు సాహితీ పురస్కారం



సీతంపేట: చందు సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రతి ఏటా సాహితీవేత్తలకు ఇస్తున్న ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారం-2025ను రచయిత, కవి, శ్రీకాకుళం జిల్లా అరసం అధ్యక్షుడు నల్లి ధర్మారావుకు అందించాలని చందు ట్రస్టు కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మేరకు సంస్థ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రజా వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు, ప్రఖ్యాత కవి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ప్రజాకవి గోరేటి వెంకన్న, నన్నయ యూనివర్సిటీ వీసీ సాతుపాటి ప్రసన్న, సాహితీవేత్త డి.వి.సూర్యారావు వంటి ఎందరో అందుకున్నారని తెలిపారు. ఈ నెల 18న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్ వార్షికోత్సవ సభలో నల్లి ధర్మారావుకు పురస్కారం ప్రదానం చేస్తామని చెప్పారు. సాహితీవేత్తలు, కవులు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

సీజ్ చేసిన 'బోరు' పరిశీలన



ముత్యమాంబకాలనీలో సీజ్ చేసి బోరును పరిశీలిస్తున్న ఏఈ సుమన్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి ముత్యమాంబకాలనీలో అధికారులు సీజ్ చేసిన బోరును సోమవారం ఏఈ సుమన్ పరిశీలించారు. జీవీఎంసీ మంచినీటి బోరు నుంచి నీటిని వార్డు కూటమి నాయకులు చోరీ చేస్తూ నీటిని వ్యాపారం చేస్తుండడంతో సాక్షిలో కథనాలు వెలువడ్డాయి. జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశాల మేరకు కబ్జా చేసిన మంచినీటి బోరును గత వారంలో సీజ్ చేశారు. తాజా పరిస్థితిని తెలుసుకునేందుకు ఏఈ సుమన్ సోమవారం సిబ్బందితో ముత్యమాంబ కాలనీకి వెళ్లి సీజ్ చేసిన బోరును పరిశీలించారు. బోరు ఓపెన్ చేస్తే సమస్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో మెయిన్ రోడ్డు పక్కన పేరుకుపోయిన సీజ్డ్ వాహనాలు

సీజ్ చేశారు.. పక్కన వదిలేశారు

ఫోర్త్‌టౌన్, ద్వారకా పీఎస్‌ల వద్ద పేరుకుపోయిన సీజ్డ్ వాహనాలు



- పోలీస్ వాహనాలకూ తప్పని తుప్పు
- మధురవాడ వెహికల్ డిపోకి తరలింపు ఎప్పుడు..?
- బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ట్రాఫిక్ సమస్యలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: 'రోడ్డు మీద వాహనాల పార్కింగ్ వద్దు.. సెల్లార్ పార్కింగ్‌ను వినియోగించండి..' అని వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు నిత్యం చేసే హితబోధ ఇది. కంచె చేను మేసిందన్న చందంగా వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ పోలీసులే రోడ్డును ఆనుకుని పార్క్‌చేసి వదిలేస్తున్నారు. ఈ వాహనాలు రహదారి పక్కన గుట్టలుగా పేరుకుపోతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని నాలుగో పట్టణ, ద్వారకా పోలీస్ స్టేషన్లను ఆనుకుని ఉన్న మెయిన్ రోడ్డు మీదే సీజ్డ్ వాహనాలను పార్క్‌చేయడం విశేషం. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైం విభాగాల్లో పలు కేసులకు సంబంధించిన వాహనాలను స్టేషన్‌కు తరలిస్తుంటారు. అంతవరకు బాగానే ఉన్నా.. ఏళ్ల తరబడి ఈ కేసులు ఒక పట్టాన తేలవు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే అన్న చందంగా పేరుకుపోతున్నాయి. ఇక్కడ కొన్ని పోలీస్ వాహనాలు కూడా తుప్పు పట్టిపోవడం విమర్శలకు తావిస్తోంది. మరోవైపు తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన యజమానులు గగ్గోలు పెడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. వాస్తవానికి మధురవాడలోని వెహికల్ డిపోకు సీజ్డ్ వాహనాలను తరలించాలని ఎంతమంది పోలీస్ కమిషనర్లు చెబుతున్నా సరే ఇటు ద్వారకా.. అటు ఫోర్త్ టౌన్ పోలీసులకు పట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాలు పేరుకుపోయి ఉండటంతో మిగిలిన వాహనాలు రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరగకముందే ద్వారకా, నాలుగో పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పందించి సీజ్డ్ వాహనాలను మధురవాడ వెహికల్ డిపోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

రాంగ్ పార్కింగ్‌తో ట్రాఫిక్ తంటాలు

జీవీఎంసీ 14వ వార్డు పరిధి జాతీయ రహదారి సిగ్నల్స్ నుంచి ఎడమ వైపు మార్గంలో బాలయ్యశాస్త్రి లేఅవుట్ మీదుగా అధిక సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. సీతమ్మధార దరి పీ అండ్ టీ కాలనీ, నార్త్ ఎక్స్‌టెన్షన్, రాధాకృష్ణ లేఅవుట్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. ఇక్కడి మెయిన్ రోడ్డు మీదే పలు వాహనాలు నిలిపి ఉంచడంతో మలుపు తిరిగే వాహన చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తంటాలు పడుతున్నారు. ఇటు సీతమ్మధార కూడలి, అటు గురుద్వారా జంక్షన్ నుంచి వచ్చే వాహనాల రాకపోకలు ఈ రోడ్డు మీదుగానే జరుగుతాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు సూచిస్తున్నారు. రోడ్డు మీదే కార్లు, అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ అధిక వేగంతో వచ్చే వాహనాలకు జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఈ రోడ్డుకు ఎదురుగానే ఆటోమొబైల్ షోరూం, కార్ మెకానిక్ షెడ్ ఉండటంతో అక్కడికి వచ్చే వాహనాల రాంగ్ పార్కింగ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని ఇతర వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దాసరి నారాయణరావుకు ఘన నివాళి



దాసరి నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హెల్ప్ టు హెల్ప్ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు సినీ దిగ్గజ దర్శకుడు, నటుడు దాసరి నారాయణరావు 78వ జయంతి వేడుకలు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాశరావు, దర్శకుడు మీగడ శివశ్రీ, డాక్టర్ మీగడ రామలింగస్వామి, డాక్టర్ బి.ఎం.నాయుడు, నిర్మాత రఘురామారావు తదితరులు దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దాసరి ఒక ఫిల్మ్ యూనివర్సిటీ అని, ఆయన జయంతిని తెలుగు సినిమా డైరెక్టర్ల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. అనంతరం ఇటీవల అవార్డులు పొందిన సెకెండ్ ఇన్నింగ్స్, ప్రావీణామృతం లఘు చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, బాబ్జి, చాట్ల బాబూరావు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాల్ టోకెన్ ఇస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతంపేట: సీతమ్మధార రైతుబజారులో సోమవారం మొత్తం 140 స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం బజార్ల రైతులకు స్టాల్ నంబర్ కేటాయింపు టోకెన్లను ఈవో కృష్ణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే విక్రయాలు చేయాలని సూచించారు. స్టాళ్లు ఉన్న రైతులు నేల మీద కూరగాయలు విక్రయించరాదని సూచించారు. సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని ధర్నా



నరసింహనగర్ రైతుబజార్ వద్ద ధర్నా చేస్తున్న చిల్లర వర్తకులు

సీతంపేట: చిల్లర వర్తకులకు హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా ఫుట్‌పాత్ అండ్ తోపుడు బళ్ల కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద చిల్లర వర్తకులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లర వర్తకులకు సామాజిక భద్రత కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ ప్రభుత్వాలు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఏళ్ల తరబడి రోడ్డు పక్కన, కూడళ్లలో నిలువ నీడలేక చిల్లర వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిల్లర వర్తకులకు గుర్తింపు కార్డులు ఇచ్చి జీవీఎంసీ చేతులు దులుపేసుకుందన్నారు. చిల్లర వర్తకుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న ఆశీలు రద్దు చేయాలని, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలన్నారు. చిల్లర వర్తకుల సమస్యలపై ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేలం శివ, సంఘం నాయకులు కె.శ్రీనివాసు, పి.సూర్యారావు, పి.సాయికుమార్, కె.గణేష్, పి.అనిల్, యు.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆరు అర్జీలు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బోడ్డేపల్లి రాము స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 03, పబ్లిక్ హెల్త్‌కు 02, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి గైర్హాజరు, సమయపాలన పాటించని అధికారులపై ఆయన మండిపడ్డారు. రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఏఈ ఉషారాణి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో రాకపోకలకు తంటాలు



జాషువానగర్ ప్రధాన రహదారిలో నిలిపిన వాహనాలు, అడ్డంగా డంపర్ బిన్



గోకుల్‌నగర్‌లో రోడ్డుపై అడ్డంగా వేసిన భవన నిర్మాణ సామగ్రి

ఫోకస్

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం బీఆర్‌టీఎస్ పరిధి జాషువానగర్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం రాంగ్ పార్కింగ్‌లతో ఆక్రమణకు గురవుతోంది. ప్రధాన రహదారికి ఆనుకుని ఆటోస్టాండ్‌లో ఆటోలు, సమీప కాలనీలో ప్రజలు భారీ వాహనాలు, జీవీఎంసీ డంపర్ బిన్లు పెట్టి వాహన చోదకులను, పాదచారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏపీఈపీడీఎల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని వాహన చోదకులు వాహనాలు పార్కింగ్ చేసేటప్పుడు రక్షణ గోడను ఇటీవల ఢీకొట్టడంతో అది కూలిపోయింది. రహదారిలో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ చెత్తాచెదారంతో నిండిపోవడంతో పాదచారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. చెత్త తరలించే సమయంలో డంపర్ బిన్‌ను ప్రధాన గెడ్డకు ఆనుకుని పెడితే రహదారిలో పాదచారులు, వాహన చోదకులు తంటాలు పడకుండా రాకపోకలు సాగిస్తారని పలువురు సూచిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఇంత నిర్లక్ష్యమా..!

జీవీఎంసీ 56 వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి వేస్తుండడంతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంచరపాలెం పరిధి దుర్గానగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, గౌరీనగర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జోన్-5 టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ లోపంతో బిల్డర్లు నిర్లక్ష్యంగా పనులు చేస్తున్నారు. ఇసుక, పిక్క, ఇటుకులు వంటి సామగ్రిని రోడ్ల మీద ఇష్టానుసారంగా వేస్తున్నారు. ఇరుకు రహదారుల్లో సామగ్రి వేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, ఘర్షణకు దిగుతున్నారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుకున్నామని దురుసుగా సమాధానాలు ఇస్తున్నారని చెబుతున్నారు.

10న మహిళలకు పోటీలు

మురళీనగర్: మాతృ దినోత్సవంలో భాగంగా మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 10న మహిళలకు పోటీలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మై మామ్....మై స్టార్ అనే అంశంపై తల్లీకూతురు జంటగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. టాలెంట్ రౌండ్, ర్యాంప్ వాక్, మామ్ అండ్ మీ గేమ్స్ ఉంటాయని చెప్పారు. టాలెంట్ రౌండ్‌లో పాటలు, నృత్యం లేదా వారికి ఇష్టమైన అంశంలో స్కిట్ ప్రదర్శించవచ్చన్నారు. ర్యాంప్ వాక్‌లో భాగంగా సంప్రదాయంగా చీరలతో వాక్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఈస్ట్ పాయింట్ వుడా కాలనీలో పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 98486 53503 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని మాధవి కోరారు.


యువతి అదృశ్యం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ సమీపంలోని ఇందిరానగర్-1లో ఎనిమిదేళ్ల నుంచి అక్కాబావతో కలిసి నివసిస్తున్న చంద్రకళ అనే యువతి ఈ నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. ఈమె నగరంలోని ఓ ఆస్పత్రిలో జనరల్ నర్సుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కార్తీక్ అనే వ్యక్తిని ప్రేమిస్తున్నట్టు తెలిసింది. ఈ సమాచారంతో సోమవారం చంద్రకళ అక్క, బావ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. యువతి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని వారు కోరారు.

ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కేంద్రం పరిశీలన

గాజువాక: గాజువాకలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రం (బుక్ డిపో)ను జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ సోమవారం సందర్శించారు. పుస్తకాల పంపిణీకి సంబంధించిన విషయాలను బుక్ డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. బుక్ డిపోకు వచ్చిన పుస్తకాలను ఎప్పటికప్పుడు ఎంఈవో కార్యాలయాలకు చేరే విధంగా చూడాలని డీఈవో సూచించారు. గతంలో 110 టైటిల్స్ ఉన్న పుస్తకాలను ప్రభుత్వం ఇప్పుడు 47 టైటిల్స్‌కు తగ్గించిందని తెలిపారు. వచ్చేనెల 12న పాఠశాలల పునఃప్రారంభానికి ముందుగానే పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేస్తామన్నారు.

యోగాసన పోటీల్లో పుష్పలత ప్రతిభ



అవార్డు అందుకుంటున్న పుష్పలత

విశాఖ విద్య: రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో నగరంలోని ఎస్ఏడీ ఏరియాకు చెందిన నీలాపు పుష్పలత ప్రతిభ చాటింది.ఆంధ్ర ప్రదేశ్ యోగ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 4న రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. 30-40 మహిళల విభాగంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది పోటీ పడగా పుష్పలత వేసిన యోగాసనాలకు రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం దక్కింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెకు వెండిపతకంతో పాటు సర్టిఫికెట్ అందజేశారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరగబోయే జాతీయస్థాయి యోగా పోటీలకు పుష్పలతను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు యోగా సాధకులు అభినందనలు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వివేకానందుడికి నివాళులర్పిస్తున్న వనితా వాకర్స్ క్లబ్, ఇతర సంస్థల సభ్యులు, పిల్లలు



మిక్స్‌డ్ కలర్ పెయింటింగ్స్‌ను చూపుతున్న చిన్నారులు

మురళీనగర్: మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో వనితా వాకర్స్ క్లబ్, ప్రశాంతి పార్కు, వనమాలి సంస్థల ఆధ్వర్యంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ముందుగా ప్రశాంతి పార్కులోని వివేకానందుడి విగ్రహానికి ఆయా సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫెవిక్రిల్ టీచర్ శిరీష లత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫెవిక్రిల్ పెయింట్‌తో చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇవి వారం రోజులపాటు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల ఆసక్తిని బట్టి మరికొద్ది రోజులు పొడిగిస్తామన్నారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి, బిందురాణి, ఉపాధ్యక్షురాలు సుదిత, వనమాలి సంస్థ ప్రతినిధి అరుణ, రమాదేవి, ప్రశాంతి పార్కు ఉపాధ్యక్షుడు జీవీ రత్నం పాల్గొన్నారు.

వనితా వాకర్స్ సేవలు భేష్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహారావు

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ వైఎల్ నరసింహారావు ప్రశంసించారు. వనితా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. నడక వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వివిధ రకాల క్యాన్సర్‌లు, వాటి నిర్ధారణ పరీక్షలు, ప్రెగ్నెన్సీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ నెల పుట్టినరోజు జరుపుకుంటున్న సభ్యులకు చిరు కానుకలు అందించారు. వనితా వాయిస్ బులెటిన్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి జయ, కోశాధికారి కె.భానుమతి, జాలీ వాకర్ ఎ.లీలావతి, సంయుక్త కార్యదర్శి జి.శిరీష, సంయుక్త కార్యదర్శి ఎం.ప్రమీలరావు, కె.బిందు రాణి, కె.వినీల, బులిటెన్ ఎడిటర్ సిహెచ్.పద్మావతి పాల్గొన్నారు.

సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు బాధ్యతల స్వీకరణ



శరత్‌బాబును సత్కరిస్తున్న జైభీమ్ సభ్యులు

గోపాలపట్నం: సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శరత్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను డిపో కార్యాలయంలో సింహాచలం డిపోపబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ జైభీమ్ అసోసియేషన్ కమిటీ, జిల్లా అసోసియేషన్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఉద్యోగులు, యాజమాన్యం సమన్వయంతో పని చేస్తే సంస్థ ప్రగతిబాటలో నడుస్తుందని జిల్లా కమిటీ కార్యదర్శి యల్లపు రాంబాబు అన్నారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. దీనిపై డిపో మనేజర్ స్పందిస్తూ అంతా సమష్టి కృషితో పని చేద్దామని అన్నారు. జిల్లా నాయకులు కె. గురయ్య, కోటేశ్వరరావు, గొల్ల సోములు, పీవీ ప్రసాద్, గోవిందరావు, అప్పారావు, ఎ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.